## 9నుంచి 24వరకు జిల్లాలో సిటీ పోలీసు యాక్ట్ అమలు

**: సిపి ఎస్.ఎం.విజయ్‌కుమార్**

**సిద్ధిపేట, డిసెంబరు 7 , ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లా పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈనెల 9 నుంచి 24 వరకు సిటీ పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని సీపీ ఎస్.ఎం.విజయ్‌కుమార్ ఆదివారం తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు,ర్యాలీలు, రాస్తారోకోలు,సభలు,సమావేశాలు నిర్వహించరాదన్నారు. ధర్నాలు,రాల్యీలు, సభలు, సమావేశాలు నిర్వహించాలంటే ముందస్తుగా పోలీసు అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. బంద్‌ల పేరిట వివిధ కారణాలను చూపుతూ బలవంతంగా వివిధ సంస్థలు, కార్యాలయాలను మూసి వేయాలని ఒత్తిడి బెదిరింపులకు గురి చేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలన్నారు.అలాగే కమిషనరేట్ పరిధిలో డిజె సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. నిబంధలను ఉల్లంఘించి డిజె వినియోగించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
# వార్త

## ఏకగ్రీవంగా గంగారం తండా సర్పంచ్ ఎన్నిక

**నాగల్‌గిద్ద, డిసెంబరు 7, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గంగారం తండా సర్పంచ్‌గా రాథోడ్ రేణుక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సర్పంచ్ పదవికి అందిన నామినేషన్లు అధికారులు పరి శీలించాక కాంగ్రెస్ మద్దతు దారు రాథోడ్ రేణుక ఒక్కరే నామినేషన్ ఉండటంతో ఎన్నికల అధికారులు ఏకగ్రీవంగా ప్రకటించ నున్నారు. గంగారం తండాలోని 8 వార్డులకు సైతం ఒకొక్కరే నామినేషన్ వేయడంతో 8 తండాలు సైతం ఏకగ్రీవం అయ్యాయి.



ఏకగ్రీవంగా ఎన్నికైన గంగారం తాండ సర్పంచ్ రాథోడ్ రేణుక



కిటకిటలాడుతున్న మల్లన్న ఆలయం

## తరలివచ్చిన భక్త జనసందోహం

**కొమురవెల్లి, డిసెంబరు 7, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయానికి ఆదివారం భక్తులు భారీగా తరలిరావడంతో కిటకిటలాడింది.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఎపి.కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.ఉదయం నుంచే స్వామి వారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. దేవాలయ ప్రధాన గోపురం ప్రాంగణం భక్తులతో నిండిపోవడంతో దర్శనానికి వచ్చిన వయో వృద్ధులు, మహిళలు, పిల్లల కోసం ప్రత్యేక మార్గాలు, క్యూలైన్‌లు ఏర్పాటు చేసి దర్శనాలను నిర్వాహకులు సజావుగా కొనసాగించారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, వైద్య సహాయం,సమాచార కేంద్రం, ట్రాఫిక్ నియంత్రణ చేపట్టారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించి పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో టంకాల వెంకటేశం, ఏఈవో బుద్ది శ్రీనివాస్, సూపరింటెండెంట్ నీల శేఖర్, ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, చేర్యాల సిఐ శ్రీనివాస్, ఎస్‌ఐ మహేష్‌ల ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.



నుజ్జునుజ్జు అయిన పోలీస్ వాహనాన్ని పరిశీలిస్తున్న ఎసిపి, సిఐ

## పోలీస్ చెక్ పోస్ట్ వద్ద తప్పిన పెను ప్రమాదం

**పోలీజ్ జీబ్‌ను ఢీ కొట్టిన చేపల లారీ.. నుజ్జునుజ్జయిన పోలీస్ జీబ్**

**హుస్నాబాద్ రూరల్, డిసెంబరు 7,ప్రభాతవార్త :**

హుస్నాబాద్ మండలంలోని జిల్లెల్లగడ్డ పోలీస్ చెక్ పోస్ట్ వద్ద పెను ప్రమాదం తప్పింది. శనివారం అర్ధరాత్రి వేళ హన్మకొండ నుండి హుస్నాబాద్ వైపు వస్తున్న చేపల లోడ్ లారీ జిల్లెల్లగడ్డ చెక్ పోస్ట్ వద్ద ఆగి ఉన్న పోలీస్ జీబ్ ను ఢీ కొట్టి బోల్తాపడింది. లారీ ఢీకొనడంతో పోలీస్ జీబ్ సుమారు 200 మీటర్ల మేర పంట పొలాల్లోకి దూసుకుపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో పోలీస్ జీబ్ లో సిబ్బంది ఎవరు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. లారీ డ్రైవర్, క్లీనర్ కు స్వల్ప గాయాలు కాగా ఆసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. సంఘటన స్థలాన్ని హుస్నాబాద్ ఏసిపి సౌదారపు సదానందం, సీఐ కోంద్ర శ్రీనివాస్‌లు పరిశీలించి పోలీస్ వాహనాన్ని బయటకు తీయించారు. చాపల లోడుతో ఉన్న లారీ వద్ద పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఏలూరు నుండి ఢిల్లీకి చాపల లోడు వెళ్తుందని ఏసిపి సదానందం తెలిపారు. లారీ డ్రైవర్ మద్యం సేవించి అతి వేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్లనే ఈ ప్రమాదానికి కారణమని తెలిపారు. ఈ విషయంలో లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## గజ్వేల్ డివిజన్‌లో సెక్షన్ 163 బిఎన్‌ఎస్‌ఎస్, 2023 అమలు సిపి విజయ్‌కుమార్

**సిద్దిపేట, డిసెంబరు 7, ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లాలోని గజ్వేల్ డివిజన్‌లో మొదటి విడతలో ఈనెల 11న జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా, శాంతి భద్రతల మధ్య జరిగేందుకు సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్, 2023 అమలు చేయడం జరుగుతుందని సీపీ ఎస్,ఎం,విజయ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈనెల 9 నుంచి 12 ఉదయం వరకు సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా 5గురు కంటే ఎక్కువ మంది గుమిగూడం,కర్రలు, లాఠీలు, రాళ్లు, కొడవళ్లు, గొడ్డళ్లు ఇతర ప్రాణాంతక ఆయుధాలను కలిగి ఉంటే చర్యలు తప్పవన్నారు. ప్రధానంగా అంక్షలు దౌల్తాబాద్, గజ్వేల్, జగదేవాపూర్, మర్కుక్, ములుగు, రాయపోల్, వర్గల్ మండలాల పరిధిలో అమలులో ఉంటుందన్నారు.నిబంధనలు ఉల్లంఘించే ఏ వ్యక్తినైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

## జాతీయ స్థాయి ఆర్ట్ ప్రదర్శనలో బస్వరాజ్ కళలు

**న్యాల్‌కల్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** ఈ నెల 9న న్యూ ఢిల్లీలో 98వ అన్యువల్ ఆల్ ఇండియా ఆర్ట్ ఎగ్జిబిసన్‌లో మండల కేంద్రమైన న్యాల్‌కల్ గ్రామానికి చెందిన శిల్పకళాకారుడు గౌరవ డాక్టరేట్ పొందిన హోతి బస్వరాజ్ శిల్పాలను ప్రదర్శించే అవకాశం దక్కింది. బస్వరాజ్ తయారు చేసిన శిల్పాలు ప్రకృతి వల్ల లాభాలు, చెట్ల పెంపకం, పశుపక్షలాది రక్షణ కాలుష్య నివారణ ప్రకృతిపై అవగాహన, వాటి పరిరక్షణ తెలిపే రీతిలో ఉంటాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.



జాతీయ స్థాయి ఆర్ట్ ప్రదర్శనలో బస్వరాజ్ కళలకు అవకాశం

## సిఎం సిద్దిపేటకు రా..

- ..రంగనాయకసాగర్‌లో బండ కట్టి నిన్ను ఎత్తేస్తే... నువ్ మునుగుతావో..తెలుతావో తెలుస్తుంది
- ..కాళేశ్వరమే కూలితే రంగనాయక, మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లలో నిండు కుండలా నీళ్ళు ఎందుకు ఉన్నాయి
- ..రాష్ట్ర వ్యాప్తంగా మొక్కజొన్న రైతులకు బకాయి పడ్డ రూ.450 కోట్లు వెంటనే చెల్లించాలి
- .. మాజీ మంత్రి హరీష్‌రావు

**చిన్నకోడూరు, డిసెంబరు 7,ప్రభాతవార్త :** కాళేశ్వరం కూలింది..కెసిఆర్, హరీష్‌రావులను బండకేసి కొట్టాలి అన్న సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యాలపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి సిద్దిపేటకు రా....రంగనాయకసాగర్‌లో బండ కట్టి నిన్ను ఎత్తేస్తే...నువ్ మునుగుతావో..తెలుతావో తెలుస్తుందని సవాల్ విసిరారు. కాళేశ్వరమే కూలితే కాళేశ్వరంలో భాగమైన రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వేయర్లలో నిండు కుండలా నీళ్ళు ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు.రంగనాయకసాగర్‌లో నీళ్ళుండి నువ్ మునిగితే కాళేశ్వరం ఉన్నట్టు..నువ్ తెలితే కాళేశ్వరం కూలినట్లన్నారు. రేవంత్‌రెడ్డి మాట్లాడేవి అన్ని అబద్దాలు..చిల్లర మాటలని మండిపడ్డారు. రిజర్వాయర్ల కింద బంగారు పంటలు పండుతాయా, లేవా ? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి మాది రైతు ప్రభుత్వం అంటారు .మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రెండు రోజుల్లో డబ్బులు వేస్తున్నామంటారు కానీ 50 రోజులు అయినా ధాన్యం అమ్ముకున్న రైతులకు డబ్బులు రావడం లేద న్నారు.చిన్నకోడూరులో 450మంది రైతులకు 59రోజుల నుంచి రూ.45కోట్లు రావాలని అంటున్నారు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.రాష్ట్ర వ్యాప్తంగా మొక్కజొన్న రైతులకు బకాయి పడ్డ రూ.450 కోట్లు వెంటనే చెల్లించాలన్నారు. గతంలో కెసిఆర్ ప్రభుత్వం బతుకమ్మ పండగకు చీరలు పంపిణీ చేసిందని రేవంత్‌రెడ్డి ఒక్కసారి అది కొంత మందికి ఇచ్చి గొప్పలు చెప్పుకుంటున్నారని పేర్కొన్నారు.రేవంత్‌రెడ్డి ఓటు అడగా లంటే మహిళలకు బకాయి పడ్డ రూ.60వేలు ఇవ్వాలన్నారు. రైతులకు బోనస్ పడాలంటే కాంగ్రెస్‌ను చిత్తు చిత్తుగా ఓడించాలన్నారు. ఆయన వెంట మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాముని శ్రీనివాస్, అల్లీపూర్ పిఎసిఎస్ చైర్మన్ సదానందంగౌడ్, బిఆర్ఎస్ నాయకులు ఇట్టబోయిన శ్రీనివాస్, కాముని ఉమేష్‌చంద్ర, జంగిటి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



:మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న హరీష్‌రావు

## నాణ్యతకు తిలోదకం

- ..డబుల్ బెడ్ రూమ్ కాలనీపనుల్లో అక్రమాలు
- ..రూ. 60 లక్షల వ్యయంతో సిసి రోడ్లు
- ..నాసిరకంగా నిర్మిస్తున్నారని స్థానికుల ఆరోపణ
- ..పట్టించుకోని అధికారులు



**రామాయంపేట, డిసెంబర్ 7, ప్రభాతవార్త :** రామాయంపేట మున్సిపల్ పరిధిలోని కేసీఆర్ డబుల్ బెడ్ రూమ్ కాలనీలో చేపట్టిన సి.సి. రోడ్డు నిర్మాణ పనుల్లో తీవ్ర నాణ్యత లోపం కనిపిస్తోంది. పట్టణంలోని మూడో వార్డు పరిధిలో (డబుల్ బెడ్ రూములు) నిధుల కింద సుమారు రూ. 60లక్షల అంచనా వ్యయంతో జరుగుతున్న ఈ పనుల్లో కాంట్రాక్టర్ నాసిరకమైన మెటీరియల్‌ను వాడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**నాణ్యతపై ప్రశ్నలు..?**

కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పనుల కోసం నాణ్యమైన మెటీరియల్ వాడకపోవడం, సిమెంట్, కంకర మిశ్రమంలో సరైన నిష్పత్తి పాటించకపోవడం వల్ల రోడ్డు మన్నికపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల పన్నుల డబ్బుతో చేపడుతున్న ఈ పనుల్లో నాణ్యత లోపిస్తే, లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతుందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పర్యవేక్షణ కరువు...**

ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఈ కీలకమైన అభివృద్ధి పనులను పర్య వేక్షించాల్సిన సంబంధిత మున్సిపల్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు అసలు పత్తాలేకుండా పోయారు. అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కరువ వడంతో, కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ, క్వాలిటీ కంట్రోల్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నాడని తెలుస్తోంది.

**నిబంధనలకు విరుద్ధంగా పనులు:**

నిబంధనల ప్రకారం, నాణ్యతను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ, అధికారుల పర్యవేక్షణలో జరగవలసిన ఈ పనులు నిబంధనలకు పూర్తిగా విరుద్ధంగా జరుగుతున్నాయి. అధికారుల నిరక్ష ్యం కాంట్రాక్టర్‌కు వరంగా మారడంతో, అతడు నాసిరకం మెటీరియల్‌ను వాడుతూ పనులను వేగంగా పూర్తిచేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. కొత్తగా వేసిన రోడ్లు తక్కువ కాలంలోనే పాడైపోయే ప్రమాదం ఉందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**తక్షణ చర్యలు అవసరం..**

ప్రభుత్వం, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, డబుల్ బెడ్ రూమ్ కాలనీలో జరుగుతున్న ఈ సీసీ రోడ్డు పనులను అధికారులు పర్యవేక్షించాలని, నాణ్యతపై సమగ్ర విచారణ జరిపించాలని స్థానిక నాయకులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నాణ్యతలేని పనులకు బాధ్యులైన కాంట్రాక్టర్‌పై, పనులను పర్యవేక్షించడంలో విఫలమైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు..



పనుల్లో నాణ్యత లేని కంకర, ఇసుకను వాడు తున్న దృశ్యం

## మౌలిక సదుపాయాలను కల్పించండి

**రవాణశాఖా మంత్రికి వినతి పత్రం అందచేత**

**రామచంద్రాపురం, డిసెంబరు 7, ప్రభాతవార్త:** జీహెచ్‌ఎంసిలో విలీనం అయిన పలు మున్సిపాలిటీల ప్రతినిధులు ఆదివారం రాష్ట్ర రావాణా శాఖ మంత్రి, జిహెచ్‌ఎంసి ఇంచార్జి పొన్నం ప్రభాకర్‌ను టేనా నేతృత్వంలో కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా తెల్లాపూర్ నైబర్‌హెడ్ అలసోసియేషన్ (టేనా) ప్రతినిధులు మాట్లాడుతూ క్యాపిటల్ వ్యాల్యూ ఆధారంగా ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లిస్తు న్నామని, జిహెచ్‌ఎంసి నివాసితులు అన్యువల్ రెంటల్ వ్యాల్యూ ఆధారంగా టాక్స్ చెల్లిస్తున్నారని, జిహెచ్‌ఎంసి నివాసితులతో పోల్చితే తెల్లాపూర్ నివాసులం 200 శాతం అధికంగా పన్నులు చెల్లిస్తు న్నామని, అందుకు ఆర్‌వి విధానాన్ని జిహెచ్ ఎంసిలో ఏకదీటుగా అమలు చేయాలని కోరారు. జిహెచ్‌ఎంసి కుటుంబాలకు నెలకు 20వేల లీటర్ల ఉచిత తాగునీటిని అందిస్తు న్నారని, ఈ పథకాన్ని కొత్తగా జిహెచ్‌ఎంసిలో విలీనం అయిన మున్సిపాలిటీలకు సైతం విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. 2015లో ప్రారంభమైన 7.7 కిలో మీటర్ల రోడ్డు పనులు నేటికి పూర్తి కాలేదని, అసంపూర్తిగా ఉన్న రోడ్డులో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, రోడ్డును వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గోపన్‌పలి -ఉస్మాన్‌నగరర్, బెల్లాపూర్ -ఉస్మాన్ నగర్, బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ రోడ్డు వంటి రహదారరులు ఏళ్లుగా పెండిం గ్‌లో ఉన్నాయని, ప్రజలు రవాణా సౌకర్యం కొరకు, భద్రత కొరకు రోడ్డును పూర్తి చేయాలన్నారు. తెల్లాపూర్ మున్సి పాలిటీలో 60కిపైగా గేటెడ్ కమ్యూనిటీలు ఇప్పటికే నివసిస్తుండగా మరో 60నిర్మాణ దశలో ఉన్నాయని, సరైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, శుద్ధి కేంద్రాల లేమి పర్యావరణ ఆరోగ్య సమస్యలకు దారితీసు న్నందున అవసరమైన మేరకు సదుపాయాలు అత్యవసరంగా ఏర్పాటు చేయాల న్నారు. ప్రతినిధుల వినతికి మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించినట్లు బండ్లగూడ, మనికొండ, నార్సింగి, అమీన్‌పూర్ మున్సిపాలిటీల ప్రతినిధులు పేర్కొన్నారు.



రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందచేస్తున్న ప్రతినిధుల దృశ్యం

## కాంగ్రెస్ సర్కార్ వడ్డీ చెల్లిస్తుంది

**కెసిఆర్ పాలనలో రాష్ట్రం అప్పుల పాలైంది**

**కాంగ్రెస్‌పై ప్రజల ఆదరణ రోజు రోజుకు పెరుగుతోంది**
**కార్మికశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి**

**సిద్దిపేట, డిసెంబరు 7,ప్రభాతవార్త :** మాజీ సిఎం కెసిఆర్ 10 యేండ్ల పాలనలో రాష్ట్రం అప్పుల పాలైందని ఆయన చేసిన అప్పులకు కాంగ్రెస్ సర్కార్ వడ్డీ చెల్లిస్తుందని రాష్ట్ర కార్మికశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కెసిఆర్ కుటుంబ పాలన అక్రమ సంపాదనపై ఎమ్మెల్సీ కవిత ప్రచారం చేస్తుందన్నారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటీ వరకు 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని త్వరలోనే మరో 40 వేల ఉద్యోగాల ప్రకటన చేయడం జరుగుతుందని సిఎం రేవంత్‌రెడ్డి హుస్నాబాద్ సభలో ప్రకటించారని గుర్తు చేశారు.మహిళలకు వడ్డీ లేని రుణాలను ఇవ్వడంతో పాటు మహిళా శక్తిని ప్రోత్సహించడానికి సిఎం అనేక పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. బిఆర్ఎస్ పాలనలో డబుల్‌బెడ్ రూంలు అందించలేదని కాంగ్రెస్ సర్కారు ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు నిర్మించి ఇస్తుందన్నారు. రాష్ట్రంలో 17 లక్షల ఇండ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ సర్కార్ రేషన్ కార్డులేని ప్రతినిరుపేద కుటుంబానికి రేషన్‌కార్డు ఇచ్చామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఓటమి తప్పదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజల ఆదరణ రోజు రోజుకు పెరుగుతుందని స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు గెలిచి స్వీప్ చేస్తుందన్నారు. సమావేశంలో సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు), పార్టీ నాయకులు సాకి అనంద్, ఎల్లం యాదవ్, కలీం, అంజయ్య, బొమ్మల యాదగిరి, లక్ష్మీ, మిట్టపల్లి శ్రీనివాస్, బిక్షపతి, వాహబ్, అజ్మత్, గయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి



తాడ్దాన్‌పల్లి టోల్ ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఎన్నికల అధికారి

## టోల్‌ఫ్లాజా వద్ద వాహనాల తనిఖీ

**చౌటకూరు, డిసెంబరు 7, ప్రభాతవార్త:** పంచాయితీ ఎన్నికలను పురస్కరించుకుని ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మండల పరిధిలోని తాడ్దాన్‌పల్లి టోల్ ఫ్లాజా వద్ద 161వ జాతీయ రహదారిపై ఆదివారం అధికారులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ నెల 14న రెండవ విడత పంచాయితీ ఎన్నికలు జరుగున్న విషయం విధితమే. టోల్ ఫ్లాజా వద్ద ప్రత్యేకంగా చెక్‌పోస్టును ఏర్పాటు చేసి అటుగా వచ్చే వాహనాలను తనిఖీలు చేస్తూ వస్తున్నారు. ఒక్కో వ్యక్తి 50వేల రూపాయలకు మించి తమ వద్ద ఉంచుకుని ప్రయాణం చేయవద్దన్న ఎన్నికల కమిషన్ నిర్ణయం మేరకు అధికారులు వాహనాలను తనిఖీ చేస్తూ వస్తున్నారు. గ్రామాల్లో పంచాయితీ బరిలో ఉన్న అభ్యర్థులు పట్టణ ప్రాంతాల నుంచి పెద్ద మొత్తంలోడబ్బులు, ఓటర్లను ప్రలోభ పెట్టి ఓట్లను దండుకునేందుకు మద్యం, బట్టలు తదితర బహుమతులు తరలకుండా పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు.



**నిబంధనలకు పాతర**

## ప్రలోభాల జాతర

**పంచాయతీ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా నేతలు**
**ఏరులైపారుతున్న మద్యం**
**జోరుగా ప్రభోద సమావేశాలతో ఓటర్లపై ఒత్తిడి**
**గుమ్మడిదల మండలంలో పంచాయతీ ఎన్నికల తీరు ఇదీ..**

**గుమ్మడిదల, డిసెంబరు 7 ప్రభాతవార్త :** ఈనెల 11వ తేదీన జరగబోయే సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో గుమ్మడిదల మండలం మొత్తంలో ఎన్నికల ఉత్కంఠ హద్దులు దాటుతోంది. పార్టీలకతీతంగా పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రజాస్వామ్య పండుగను పక్కకు నెట్టి మద్యం, డబ్బు, ప్రలోభాల రాజకీయాలతో ఎన్నికల వాతావరణాన్ని పూర్తిగా కలుషితం చేస్తున్నారు. ఎన్నికల నిబంధనలు, నైతికత, ఎథికల్ క్యాంపెయిన్ అన్న మాటలకు ఈసారి పోటీదారులు పూర్తిగా చెవి పెట్టకుండా, చాలా గ్రామాలలో రాత్రివేళ మద్యం ఏరులై పారే స్థాయిలో పంపిణీ జరుగుతుండటంపై ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూర్వ ప్రణాళిక ప్రకారం అభ్యర్థులు తమ అనుచరుల ద్వారా ఓటర్లను ఒకచోట చేర్చి ప్రభోద సమావేశాల పేరుతో ఓట్లు మళ్లించే ప్రయత్నాలు చేస్తున్నారు. భోజనం, డబ్బు, మద్యం వెరసి ఓటు మార్కెట్ హోరెత్తింపు అభ్యర్థుల ప్రతిష్టాత్మక పోటీ పేరుతో ఇంటింటికీ మద్యం సరఫరా, ప్రతి ఓటరిపై లక్ష్యపూర్వక పర్యవేక్షణ, ప్రభావిత సమావేశాలు, డబ్బు బహుమతుల పంచిపోతలు అన్నీ ఎన్నికల నిబంధనలకు విరుద్ధమైందేనని చేపట్టినా, వాస్తవానికి మాత్రం ఓటుకు విలువ పేరుతో దందాలు బహిరంగంగా సాగుతున్నాయి. గ్రామ ప్రజలు ఇది ఎన్నికలేనా? లేక మద్యం పండగా.. అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. అభ్యర్థుల మధ్య పోటీ ఎంత హోరాహోరీగా ఉందో, ఖర్చులు కూడా అంతే బాగా పెరిగాయని స్థానికులు చెబుతున్నారు. తమ అభ్యర్థి గెలవాలని పోటీలో అసలు అభ్యర్థి కన్నా ఎనకాల ఉన్న నాయకులకే ఉత్సాహం ఎక్కువైంది. ఇంత పెద్ద ఎత్తున జరుగుతున్న అక్రమాలకు అధికారులు కన్నుపెట్టకపోవడం ప్రజల్లో అనుమానాలు రేకెత్తిస్తోంది. ఎన్నికల ప్రత్యేక దళాలు, విజిలెన్స్ టీమ్‌లు ఉన్నప్పటికీ, గ్రామాలలో జరుగుతున్న మద్యండబ్బు, భోజనం వసతులు, రాజకీయాలపై ఎటువంటి కఠిన చర్యలు కనిపించకపోవడం పట్ల విమర్శలు వెల్లువెతున్నాయి. ఇప్పటికైనా నిఘా సంస్థలు, అధికారులు స్పందించి ఎన్నికలు ప్రచారం నిర్వహించే విధానాన్ని పరిశీలించాలని కోరుచున్నారు.

## కలహాల కుంపట్లు

**ఎన్నికల వేళ యువకుల మధ్య పెరుగుతున్న విభేదాలు**
**ప్రత్యర్థి పార్టీల నేతలపై సోషల్ మీడియా వేదికగా పరస్పర విమర్శలు**

**టేక్మాల్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** స్థానిక ఎన్నికల్లో వాట్సాప్ గ్రూపుల్లో కొందరు యువకులు డైలాగ్ వార్ కొనసాగిస్తున్నారు. సర్పంచ్ ఎన్నికలు యవత మధ్య విభేదాలను తీసుకువస్తున్నాయి. విలేజ్ గ్రూప్లలో డైలాగ్ వార్ నడుస్తోంది. ఎన్నికల్లో పోటీ చేసేవాళ్లు వాళ్లపని వాళ్లు చేసుకుంటుండగా, పోటీ చేయని వాళ్లు.. వాళ్ల తరపున వాట్సాప్ గ్రూప్లలో మాటల యుద్ధానికి దిగుతున్నారు. ఒకరి పార్టీపై మరొకరు విమర్శలు చేస్తున్నారు. మీ పార్టీ ఇలా... మీ నాయకుడు అలా... అంటూ చర్చ వాట్సప్ గ్రుపులను వేదికలను మార్చుకోని చేస్తూ ఒకరిపై మరొకరు సవాళ్లు, ప్రతి సవాళ్లు విసురుకుంటున్నారు. దీంతో అభ్యర్థులకు రావాల్సిన ఓట్లు రాక పోగ చివరకు అదికాస్త వ్యక్తిగత గొడవలకు దారితీస్తోంది. వీళ్ల చేసే డైలాగ్ వారు పోటీలో ఉన్న అభ్యర్థులు బాధ్యత వహించాల్సి వస్తోంది. ఎన్నికలు వస్తాయి.. పోతాయి.. గెలిచిన, ఓడిన అభ్యర్థులు భవిష్యత్తులో కలిసిపోతారు. ఎన్నికల్లో ఎవరు ఎవరికి మద్దతిచ్చినా రేపు ఓడిన అభ్యర్థికి మద్దతిచ్చిన వాళ్లు కూడా గెలి చిన అభ్యర్థి వద్దకు వెళ్లగలిగే వాతావరణం ఉన్నపుడే గ్రామాలు అభివృద్ధి సాది స్తాయన్న విషయాన్ని గుర్తించుకోవాలి. మాట మాట పెంచుకొని గోరంత విష యాన్ని కొండంతగా మార్చి గ్రామాలలో ఉన్న ప్రశాంతతను చెడగొట్టకూడదని తెలుసుకోవాలి. నిర్వహించే ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని పార్టీల నాయకులు సమన్వయం పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



## సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి



**నార్సింగి, డిసెంబర్ 7 ప్రభాతవార్త :** శేరిలింగంపల్లి జోన్‌లో కొత్తగా కలిసిన మున్సిపాలిటీలలోని ముఖ్యమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రతినిధుల బృందం మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు ఆంజనేయులు, రవీందర్‌రెడ్డి, కాంతారావ్‌లు మాట్లాడుతూ అద్దె విలువ ఆధారంగా ఆస్థిపన్నులు వసూలు చేయాలని, మణికొండలో విచ్చల విడిగా వెలుస్తున్న వైన్‌షాపుల అనుమతిని రద్దు చేయాలని, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని మంత్రి ప్రభాకర్‌గౌడ్‌ను కోరామని వివరించారు. పార్కులు, నాలాల స్థలాలు కబ్జా కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో వివరించామని తెలిపారు. వినతిపత్రం అందుకున్న మంత్రి ప్రభాకర్ స్పందిస్తూ గ్రేటర్ కమీషనర్‌కు ఫోన్‌చేసి ఆస్థి పన్నులను అద్దె విలువల ఆధారంగా వసూలు చేయాలని సూచించారు. మీరు నా దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలన్నింటిని సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరించేలా నావంతు ప్రయత్నం చేస్తానని హామీనిచ్చారని ప్రతినిధుల బృందం తెలిపింది. మంత్రిని కలిసిన వారిలో మణికొండ, తెల్లాపూర్, బండ్లగూడ మున్సిపాలిటీల ప్రతినిధులు ఉన్నారు.

## సాహితీలోకానికి విశేష సేవలందించిన మహనీయురాలు తెన్నేటి సుధాదేవి



తెన్నేటి సుధాదేవి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నివాళులు అర్పించిన రాగరాగిణి ఆర్ట్స్ ప్రతినిధులు

**చిక్కడపల్లి డిసెంబర్ 7 ప్రభాతవార్త :** రచయిత్రిగా సాహితీలోకానికి విశేషంగా సేవలందించిన మహనీయురాలు తెన్నేటి సుధాదేవి అని నివాళులు అర్పించిన రాగరాగిణి ఆర్ట్స్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం వి.రమణ కుమారి, ఎం .వి. సుబ్బలక్ష్మి అన్నారు. ఆదివారం నల్లకుంటలోని తెన్నేటి సుధాదేవి నివాసానికి చేరుకున్న ఎం వి.రమణ కుమారి, ఎం .వి. సుబ్బలక్ష్మి ప్రముఖ రచయిత్రి వంశీ ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షురాలు డాక్టర్ తెన్నేటి సుధాదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి సుధాదేవి భర్త, వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీ రామరాజును పరామర్శించారు. సుధాదేవి బహుముఖ ప్రజ్ఞాశాలి అని, ప్రతేకంగా తెలుగు సామెతలమీద 500 నాటికలు రాయటం తెలుగు వారికి గర్వకారణమని ప్రశంసించారు. తెలుగు అకాడెమీ లో 3 దశాబ్దాల పైగా డిప్యూటీ డైరెక్ట్ గా పనిచేసి తెలుగు భాషకు ఆమె చేసిన సేవలే కాకుండా గత యాభై సంవత్సరాలుగా వంశీ ఆర్ట్ థియేటర్స్ కి సాంస్కృతిక సేవలందించారని కొనియాడారు.

## సాయి ఈశ్వర చారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

**-డిఎస్‌డి జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్**



ప్రసంగిస్తున్న డిఎస్‌డి జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్

**చిక్కడపల్లి డిసెంబర్ 7 ప్రభాతవార్త :**
బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం ఆత్మహత్య చేసుకున్న సాయి ఈశ్వర చారి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డెవెలప్‌మెంట్ ఫర్ ది డీఫ్ ( డి ఎస్ డి) జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ డిమాండ్ చేసారు. ఆదివారం చిక్కడపల్లి లోని డి ఎస్ డి కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో కో కన్వీనర్ కాటమోని వెంకటేష్ గౌడ్‌తో కలిసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలతో చెలగాటం ఆడటమే కాకుండా బీసీలను ఆత్మహత్యలకు దారితీసే విధంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం ప్రాణత్యాగం చేసిన ఈశ్వ రచారి కుటుంబానికి ప్రభుత్వం రూ.50లక్షలతో పాటు అతని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. బిసి ఉద్యమ నేత సాయి ఈశ్వర్ ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరం అని ఆవేదన వ్యక్తం చేసారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈశ్వరాచారి కుటుంబానికి వెంటనే 25 లక్షలు రూపాయలు నష్టపరిహారం, డబుల్ బెడ్ రూమ్ ఇవ్వడంతో పాటు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఇలాంటి ఆత్మహత్యలు సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

## త్వరలో అందుబాటులోకి డివిజన్ పార్కులు

**-గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్**



గాంధీనగర్ డివిజన్ పార్కులలో పెండింగ్ లో ఉన్న పనులను పర్యవేక్షిస్తున్న స్థానిక కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

**చిక్కడపల్లి డిసెంబర్ 7,ప్రభాతవార్త :**
గాంధీనగర్ డివిజన్‌లో పలు పార్కులలో పెండింగ్ పనులు పూర్తి ప్రజలకు అందుకుబాటులోకి తెస్తామని స్థానిక కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అన్నారు. ఆదివారం హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ చంద్రకాంత్, మేనేజర్ ధీరజ్ వారి సిబ్బంది , బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్‌తో కలసి పనులు పూర్తైన పార్కులను పర్యవేక్షించారు. డివిజన్‌లోని పి అండ్ టి పార్క్ ( సురభి పార్క్) కెనరా బ్యాంక్ పార్కులను సుమారు రూ: 8 లక్షల జి హెచ్ ఎం సి నిధులతో ఆహ్లాదకరమైన వాతావరణం తో అభివృద్ధి చేస్తున్నామని, త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న పార్కు లను, సీనియర్ సిటిజన్లకు, పిల్లలకు, స్థానికులకు,చక్కటి వాతావరణం,ఆహ్లాదకరమైన పచ్చటి చెట్లు, మొక్కలతో ఆధునీకరించి పార్కులను అందుబాటులోకి తెస్తున్నదుకు సంతోషకరంగా వుందని అన్నారు.కార్యక్రమంలో బిజెపి డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు,జ్ఞానేశ్వర్,రాజ్ కుమార్ మరియు స్థానిక కాలనీ వాసులు కళావతి,రాజేశ్వరి,రాజు పాల్గొన్నారు.

## సుందరయ్య పార్క్ అభివృద్ధికి కృషి చేస్తా : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎస్. మనోహర్ రెడ్డి ని సత్కరిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**చిక్కడపల్లి డిసెంబర్ 7 ప్రభాతవార్త :**
సుందరయ్య పార్క్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. వాకర్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ సెంట్రల్ సహకారం తీసుకుంటామని అన్నారు. ఆదివారం బాగ్ లింగంపల్లి డాక్టర్ బి.ఆర్ అంబెద్కర్ విద్యాసంస్థల ఆవరణలో వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 301 ఆధ్వర్యంలో సదస్సు, అవార్డుల ప్రధానోత్సవ సభ డిస్ట్రిక్ట్ గవర్నర్ లింగా ప్రకాష్ నేతృత్వంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యుడు బి.దయానంద్, .తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా, తెలంగాణ ఆర్య వైశ్య కార్పొరేషన్ ఛైర్ పర్సన్ కాల్వ సుజాత, వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి, రాంనగర్ కార్పొరేటర్ రవిచారి, ప్రోగ్రాం ఛైర్ పర్సన్ బి.శ్రవణ్ కుమార్, డిస్ట్రిక్ట్ కాబినెట్ కార్యదర్శి కె.శైలజ మోహన్, కోశాధికారి జి. నాగేందర్, వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షులు రామానందం, వి. నాగభూషణం, తాళ్లపల్లి చక్రపాణి, వై. శ్రీనివాస చారి, డాక్టర్ బి. గంగాధర్ రెడ్డి, సంపత్ రెడ్డి, దామోదర్ రెడ్డి, ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎస్. మురళీ కృష్ణ, వాకర్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ సెంట్రల్ పూర్వ అధ్యక్షుడు పి.వి. నిరంజన్ రెడ్డి, ప్రస్తుత అధ్యక్షుడు ఎస్. మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లిడ్‌క్యాప్‌ను ప్రభుత్వం తక్షణమే పునరుద్దరించాలని ప్రదర్శన



అంబేద్కర్ విగ్రహం ఎదట మాట్లాడుతున్న పల్లెల వీరాస్వామి, చిత్రంలో మొలుగు రాజు తదితరులు

**సైఫాబాద్, డిసెంబరు 7 ప్రభాతవార్త:** చర్మకారులకు ఉపాధిని కల్పించే లిడ్‌క్యాప్‌ను ప్రభుత్వం తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఆనేక మంది ఆదివారం నగరంలో ప్రదర్శన చేపట్టారు. తెలంగాణ లెదర్ ఆర్టిజన్స్ కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రదర్శన బషీర్‌బాగ్‌లోని డా.బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ప్రారంభమై ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు పల్లెల వీరాస్వామి, ప్రధాన కార్యదర్శి మొలుగు రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే లిడ్‌క్యాప్‌ను పునరుద్ధరిస్తూ, దాని భూములను రక్షించాలని, లీజ్‌కు ఇచ్చిన భూములను తిరిగి తీసుకోవాలని, లిడ్‌క్యాప్‌ను పరిశ్రమగా గుర్తించి, కార్పోరేషన్‌గా ఏర్పాటు చేసి 12 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని, కబ్జాకు గురైన భూములను స్వాదీనం చేసుకోవాలని, ఎండిని తొలగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సొసైటి సలహాదారు డా.ఆరెపల్లి రాజేందర్,బిఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, సొసైటి నాయకులు రవీందర్, చిట్యాల మొగిలి, కొండయ్య, రాంబాబు, ఓంప్రకాష్, రమేష్, సతీష్,ఎంపిఎస్ నాయకుడు కృష్ణ, బిజెపి నాయకుడు చింతా సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సమాజహితం కోసం జర్నలిస్టుల పాత్ర ఎనలేనిది

**-ఉద్యోగంతోపాటు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి**

**-జెపిఎల్ ప్రారంభోత్సవంలో మాజీ మంత్రి హరీష్‌రావు**



వివిధ జట్ల జెర్సీని ఆవిష్కరిస్తున్న హరీష్‌రావు, మర్రి రాజశేఖర్‌రెడ్డి, వివేకానందగౌడ్ తదితరులు

**హైదరాబాద్,డిసెంబరు 7,ప్రభాతవార్త:**
జర్నలిస్టులు సమాజ హితం, ప్రజల కోసం నిబద్ధతతో పని చేస్తారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ఆదివారం దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ క్రికెట్ గ్రౌండ్స్‌లో జరిగిన నెక్ జర్నలిస్టు ప్రీమియర్ లీగ్ (జెపిఎల్) సీజన్2 ప్రారంభోత్సవానికి హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలిటీషియన్స్, జర్నలిస్టులు, పోలీసులు, డాక్టర్స్ వృత్తుల్లో పని చేసే వారికి సెలవులు ఉండవని, వ్యక్తిగత జీవితం కంటే వృత్తికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని చెప్పారు. వీరిలో నిత్యం బిజీగా ఉండే జర్నలిస్టులు పని ఒత్తిడి, ఫీల్డ్‌లో ఎండ, వాన లెక్క చేయకుండా తిరగడం, డెస్క్ జర్నలిస్టులు రాత్రి వేళ పనిచేయడం, డెడ్‌లైన్లు తగ్గట్టుగా పని చేయడం వల్ల చిన్న వయసులోనే బీపీ, షుగర్ వంటి ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని అన్నారు. మనిషి ఆరోగ్యంగా ఉంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చునని, కాబట్టి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని జర్నలిస్టులకు సూచించారు. యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని చెప్పారు. జేపీఎల్‌లో ఆడుతున్న జట్లన్నింటికి బెస్ట్ ఆఫ్ లక్ చెప్పారు. నిత్యం బిజీగా ఉండే జర్నలిస్టులు వారి కోసం కొంత సమయం వెచ్చించి ఐదు రోజుల పాటు ఈ లీగ్‌ను నిర్వహించుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు.

**వెటరన్ అథ్లెట్ మర్రి లక్ష్మణ్ రెడ్డికి సన్మానం**

ఎంఎల్ఆర్ఐటీ విద్యాసంస్థల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి గారు 80 ఏళ్ల వయసులో కూడా 21 ఏళ్ల యువకుడులా ఉన్నారంటే ఫిట్‌నెస్‌కు ఆయన ఇస్తున్న ప్రాధాన్యతే కారణమని ప్రశంసించారు. యువత లక్ష్మణ్ రెడ్డి వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ వయసులో కూడా ఆయన కృష్ణానదిని ఈ ఒడ్డు నుంచి ఆ ఒడ్డుకు ఈదుతున్నారంటే సాధారణ విషయం కాదని కొనియాడారు. తల్లి అరుంధతి రెడ్డి పేరిట ఆస్పత్రి స్థాపించి పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తున్న ఎంఎల్ ఆర్ఐటీ విద్యాసంస్థల సెక్రటరీ, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కుత్బులాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, శాట్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి, టీఎస్ఎంఐడీసీ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, స్పోర్ట్స్ డైరెక్టర్ చల్లా భరత్ రెడ్డి పాల్గొన్నారు.

## అత్తలూరి విజయ లక్ష్మికి సాహితీ సామ్రాజ్ఞి బిరుదు ప్రధానం



అత్తలూరి విజయ లక్ష్మి కి సాహితీ సామ్రాజ్ఞి బిరుదు ప్రధానం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి డిసెంబర్ 7 ప్రభాతవార్త :** ప్రముఖ రచయిత్రి అత్తలూరి విజయ లక్ష్మి తన రచనా సాహిత్యంలో అభ్యు దయ భావాలు మానవతా విలువలకు ప్రాధాన్యత ఇచ్చా రని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అ న్నారు. ప్రముఖ రచయిత్రి అత్తలూరి విజయ లక్ష్మి రచ నా వ్యాసంగం 50 ఏండ్ల ప్రస్థానంగా సాహితీ స్వర్ణోత్సవం శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై వంశీ ఆర్ట్స్ థియేటర్స్, లేఖిని రచయిత్రులు వేదికపై ముగింపు సభ జరిగింది. ఈ సందర్భంగా శిరోమణి వంశీ రామరాజు ఈ సందర్భంగా అత్తలూరి విజయలక్ష్మికి సాహితీ సామ్రాజ్ఞి బిరుదు ప్రధానం చేసి గౌరవించారు. విజయ లక్ష్మి బహుముఖీన ప్రజ్ఞ గురించి చెప్పారు. ప్రముఖ దర్శకుడు వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ విజయ లక్ష్మి రాసిన బొమ్మ నవలని సినిమాగా తెస్తానని ప్రకటించారు. ఆంధ్ర ప్రదేశ్ సంస్కృత తెలుగు అకాడమీ చైర్మన్ శరత్ చంద్ర మాట్లాడుతూ దమ్మున్న రచయిత్రి విజయ లక్ష్మి అన్నారు. ప్రముఖ నాటక రచయిత విజయ భాస్కర్, రాంకీ, రాము రెడ్డి, తోటకూర ప్రసాద్ రామ కోటేశ్వర రావు తదితరులు తమ అభినందన తెలిపారు. వంశీ రామరాజు సాహితీ సామ్రాజ్ఞి బిరుదు విజయలక్ష్మికి ప్రదానం చేశారు. లేఖిని రచయిత్రులు విజయ లక్ష్మికి పాతిక వేల రూపాయలు నగదు పురస్కారం తో జ్ఞాపిక బహు కరించారు. విజయ లక్ష్మి రచించిన మహారాణి హాస్య నాటిక శ్రీ జ దర్శకత్వం లో ప్రదర్శించారు.

### కెన్నడీ హై ద గ్లోబల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు



**నిజాంపేట్, డిసెంబర్ 7, ప్రభాతవార్త :**
కెన్నడీ హై ద గ్లోబల్ స్కూలులో ఆదివారం సాయంత్రం 21వ వార్షికోత్సవ వేడుకలు (పర్వాజ్) ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో శిశు వైద్య నిపుణులు డాక్టర్. వి.కేదార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కెన్నడీ గ్లోబల్ స్కూల్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ బి. సుబ్బారెడ్డి, కెన్నడీ రెసిడెన్సియల్ స్కూల్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎమ్. సుబ్బారెడ్డి, కెన్నడీ రెసిడెన్సియల్ స్కూల్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ డా. బి. సుధాకర్ రావు, కెన్నడీ హై ద గ్లోబల్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్, కమాండర్ ఎన్. కృష్ణాకర్ రెడ్డి కెన్నడీ హై ద గ్లోబల్ స్కూల్, ఎకడమిక్ డైరెక్టర్, సీనియర్ ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మి భట్ జ్యోతి ప్రజ్వలన చేసి వేదికను అలంకరించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్, కమాండర్ యన్. కృపాకర్ రెడ్డి ప్రసంగిస్తూ అమాయకత్వంతో కల్మషం లేకుండా ముద్దుగా మాట్లాడే ఈ చిన్నారులు రేపు దేశ భవిష్యత్తుని నిర్ణయించే భావి భారత నిర్మాతలని, చిన్నతనం నుండే వారు ప్రతి క్షణాన్ని ఉల్లాస భరితంగా, ఆలోచనాత్మకంగా, సహృదయతతో పెరిగే చక్కటి వాతావరణాన్ని సమకూర్చే బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఆధారపడి ఉందని అన్నారు. పాఠశాల ఎకడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మీ భట్ వార్షిక నివేదికను సమర్పించి, పాఠశాల నిర్వహణా పద్ధతులు వివరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డా. వి. కేదార్ తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ ముచ్చట గొల్పుతున్న ఈ పసికూనలకు ఆరోగ్యవంతమైన వాతావరణం కల్పించి, నైతిక విలువలను పెంపొందింపచేసే బాధ్యత తల్లిదండ్రులపైన కూడా ఉందనీ చెప్పారు. అనంతరం ప్రతిభావంతులైన విద్యార్థినీ విద్యార్థులకు విలువైన బహుమతులు అందజేసి అభినందించారు. పర్వాజ్ అనే భావనతో సాగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

### అయ్యప్ప స్వామి మహాపడి పూజ మహోత్సవంలో శంభీపూర్ క్రిష్ణ



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న శంభీపూర్ క్రిష్ణ

**నిజాంపేట్, డిసెంబర్ 7, ప్రభాతవార్త**
పటాన్ చెరువు నియోజకవర్గం గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధి గడ్డపోతారంలో బాశెట్టిగారి వేణు, ప్రదీప్ అయ్యప్ప స్వాములు వారు ఏర్పాటు చేసుకున్న అయ్యప్ప స్వామి మహా పడి పూజా కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి మహా పడి పూజా కార్యక్రమంలో పాల్గొనటం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు రోజు ఎంతో బిజీగా జీవనం కొనసాగిస్తున్నారు. దానితో పాటు కొంత ఆధ్యాత్మికతకు కూడా సమయం కేటాయిస్తే అందరూ భక్తి శ్రద్ధలతో పాటు సుఖ సంతోషంగా ఉండవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ పులిగిల్ల ప్రకాష్ చారి, మాజీ యంపిపి రవీంద్ర గౌడ్, ఉపసర్పంచ్ పెంటేష్, తాజా మాజీ కౌన్సిలర్ కొర్ర శంకర్ నాయక్, 27వ వార్డు ప్రెసిడెంట్ కొర్ర అమర్ సింగ్, నాయకులు అనిల్ కుమార్, శ్రీనివాస్, శ్రీధర్, బాలకృష్ణ, శ్రీశైలం యాదవ్, కొడకంచి నందు, కొడకంచి అర్జున్, కొడకంచి సాయి, బశెట్టిగారి చందు, బశెట్టిగారి కార్తీక్, స్థానిక నాయకులు, అయ్యప్ప స్వాములు, కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.

## ఇంటి పెద్దమరణంతో దిక్కుతోచనిస్థితిలో కుటుంబ సభ్యులు

**-పోలీసుల సహాయంతో ఆశ్రయం పొందిన బాధితులు**

**-మానవత్వమే ముఖ్యం : జీడిమెట్ల సిఐ గడ్డంమల్లేశ్**



జీడిమెట్ల పోలీసులు చేరదీసిన దాసు భార్య, ఇద్దరు కుమార్తెలు

**కుత్బుల్లాపూర్, డిసెంబరు 7 ప్రభాతవార్త**
ఇంటిపెద్ద అనారోగ్యంతో అకాల మరణం. అంత్యక్రియలకు కూడా ఆర్థిక స్థోమతలేక ఇంట్లోనే మూడురోజులపాటు శవంతో గడిపిన కుటుంబ సభ్యులు. చుట్టుపక్కలవారి సమాచారంతో విచారణ చేపట్టిన పోలీసులకు కుటుంబ సభ్యుల దయనీయస్థితి అర్థమయ్యింది. దీనితో మానవత్వాన్ని చాటుకున్న పోలీసులు దగ్గరుండి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి అనంతరం దిక్కుతోచని ఆ కుటుంబ సభ్యులను చేరదీసి ఒక ఆశ్రమంలో చేర్చి తామున్నామని బరోసాఇచ్చారు. ఈ తంతుమొత్తం జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే...జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్ఎల్‌బి నగర్‌కు చెందిన దాసు(76) వారంరోజులక్రితం ఆనారోగ్యంతో మృతిచెందాడు. మృతిచెందిన దాసుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చావుఖర్చులకు కూడా తమవద్ద డబ్బులేక శవాన్ని మూడు రోజులుగా ఇంట్లోనే పెట్టుకున్నారు. చుట్టుపక్కలవారి ద్వారా సమాచారం సేకరించిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారించగా దాసు మరణించిన అనంతరం రెండు రోజులుగా వారు ఆహారం సైతంలేక సతమతమవుతున్నట్లు గుర్తించారు. తమకు ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నాయని ఎవరినీ అడిగేందుకు కూడా మోహమాటపడే స్థితిలో వీరు ముగ్గురు ఎవరినీ ఆశ్రయించలేదు. సమాచారం తెలిసిన వెంటనే జీడిమెట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ ఆధ్వర్యంలో దాసు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీఆసుపత్రికి తరలించారు. అనంతరం రెండురోజులుగా ఆహారంలేక కుంగిపోతున్న కుటుంబ సభ్యులకు ఆహారం తెప్పించి అనంతరం వారు ముగ్గురినీ నగరంలోని బైబిల్‌హౌస్‌లో ఉన్న ఆశ్రమానికి తరలించారు. ఇంటిపెద్ద చనిపోయి దిక్కుతోచనిస్థితిలో పోలీసులు మానవతాదృక్పదంతో అంత్యక్రియలు నిర్వహించడంతోపాటు కుటుంబ సభ్యులు కుదుటపడేవరకు ఆశ్రమంలో నివసించేలాచేసి మానవత్వాన్ని చాటుకోవడం స్థానికంగా అభినందలు వెల్లువెత్తాయి.

## రాజేశ్వరరావు రచనల పుస్తకాలు ఆవిష్కరణ



రాజేశ్వరరావు రచనల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మోహన్ కందా. చిత్రంలో కె.శ్రీనివాస్‌రెడ్డి. మాడభూషి శ్రీధర్, ఉడయవర్లు తదితరులు

**సైఫాబాద్, డిసెంబరు 7 ప్రభాతవార్త:** సీనియర్ జర్నలిస్టు, వయోధిక పాత్రికేయ సంఘం ఉపాధ్యక్షుడు ములుగు రాజేశ్వరరావు రచనలు 'నేను బహువచనం' (ఆత్మకథ), 'అధినాయక జయహే' (కవితా సంకలనం) అనే పుస్తకాలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మోహన్‌కందా ఆవిష్కరించారు. సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఈ పుస్తకాల ఆవిష్కరణ సభలో ముఖ్య అతిధిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులు కష్టాలను ఎదుర్కొంటూనే వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అకాడమీ ఆధ్వర్యంలో త్వరలో 12 మంది సీనియర్ జర్నలిస్టుల జీవిత చరిత్ర, వృత్తి నైపుణ్యం అనుభవాలపై ప్రత్యేకంగా పుస్తకం తీసుకువస్తున్నామని చెప్పారు. నేటి తరానికి ఇలాంటి పుస్తకాలు ఎంతో అవసరమన్నారు. నేడు సమాజంలో జరుగుతున్న పరిణామాలకు ఈ పుస్తకాలు అద్దం పుడుతున్నాయని పుస్తక చైతన్యం ద్వారానే ప్రజల్లో చైతన్యం వచ్చి ప్రజాస్వామ్య మనుగడ కొనసాగుతందని డా.మోహన్ కందా చెప్పారు. వయోధిక పాత్రికేయ సంఘం అధ్యక్షుడు దాసు కేశవరావు, కేంద్ర సమాచార మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, సీనియర్ జర్నలస్టులు ఎస్.వినయ్‌కుమార్, జి.వల్లీశ్వర్, ఎమెస్కో సంపాదకులు డి.చంద్రశేఖర్‌రెడ్డి, డా.అంబటి సురేంద్ర రాజు, ప్రముఖ కవి నాళేశ్వరం శంకరం, సంఘం ఉపాధ్యక్షుడు టి.ఉడయవర్లు, కార్యదర్శి కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి మహాపడి పూజ



అయ్యప్ప స్వామి పూజలో పాల్గొన్న వద్దేపల్లి రాజేశ్వరరావు

**కూకట్‌పల్లి, డిసెంబర్ 7, ప్రభాతవార్త :**
కూకట్‌పల్లిలోని మూసాపేట్ గౌతమ్ మోడల్ స్కూల్ వద్ద కుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో, సభాపతి పవన్ కుమార్ శర్మ కారకమలములచేత నిర్వహించిన అయ్యప్ప స్వామి 18వ మహ పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ అత్యంత ఘనంగా జరిగింది. కుమార్ గురుస్వామి ఆహ్వానం మేరకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దేపల్లి రాజేశ్వరరావు గురుస్వామి పూజలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు. అనంతరం రాజు స్వామి భజన పాటలు ఆ ప్రాంగణాన్ని ఆధ్యాత్మికతతో నింపాయి. అయ్యప్ప స్వామి భక్తిలో ఉన్న నియమం, నియంత్రణ, నిష్ట మనిషిని ధర్మమార్గంలో నడిపే శక్తి అన్నారు. ఇలాంటి మహాపడి పూజలు భక్తిని మాత్రమే కాదు, సమాజంలో శాంతి సౌభ్రాతృత్వ భావాలను పెంపొందిస్తాయనీ తెలియజేశారు. సేవాభావంతో ఈ మహోత్సవాన్ని చేసిన నిర్వాహకులకు అభినందనలు తెలియజేస్తూ, కుమార్ గురుస్వామి 18వ పడి సందర్భంగా రాజేశ్వరరావు స్వామి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### బిజెపి మహా ధర్నాకు తరలివెళ్లిన బిజెపి శ్రేణులు



ధర్నాలో పాల్గొన్న నాయకులు

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 7, ప్రభాతవార్త :**
రెండేళ్లుగా అమలు కాని హామీలపై ప్రజావంచన చేస్తున్న కాంగ్రెస్ పాలనను నిరసిస్తూ రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ మహాధర్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ, బీజేపీ రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆదివారం హైదరాబాద్ ఇంధిరా పార్క్ వద్ద మహాధర్నాను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దేపల్లి రాజేశ్వరరావు, కూకట్‌పల్లి నియోజకవర్గ నాయకులతో కలిసి పాల్గొన్నారు. మహిళలకు నెలకు రూ. 2,500 హామీ ఎక్కడ, వృద్ధులకు ఇచ్చిన రూ. 4,000 పింఛన్ మాట ఏమైందీ, రైతులకు, ఉద్యోగులకు, కూలీలకు ఇచ్చిన భరోసా ఎందుకు నిలబెట్టలేకపోతున్నారు. విద్యుత్, ధరలు, పన్నులు అన్నీ పెంచి ప్రజలను కష్టాల్లోకి నెట్టేస్తున్నారన్నారని బిజెపి నాయకులు ధ్వజమెత్తారు. ఈ నిరసన కార్యక్రమంలో వివిధ మహిళా సంఘాల నాయకులు, యువత, కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బీజేపీ నాయకులూ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేశారు.



టీ హబ్ మాదాపూర్‌లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రారంభిస్తున్న ఫుట్ డాక్టర్ వాకథం రన్

## క్రీడలు మానసిక స్థైర్యాన్ని పెంచుతాయి

**: బిజెవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్**



రాజు యాదవ్‌ను సన్మానించిన స్కూల్ యాజమాన్యం

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 7, ప్రభాతవార్త :**
వివేకానంద నగర్ డివిజన్‌లో ఉదయ్ మాస్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి మార్షల్ ఆర్ట్స్, కరాటే పోటీలకు ముఖ్యఅతిథిగా బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ కరాటే క్రీడలు మానసిక ధైర్యాన్ని నింపుతాయి అన్నారు. కరాటే నేర్చుకోవడం వలన ఆత్మ రక్షణకు ఉపయోగపడుతుందని అన్నారు. కార్పొరేట్ విద్యావ్యవస్థలో ఉన్న మనము చదువుతోపాటు క్రీడలలో కూడా పోటీ తత్వాన్ని అలవర్చుకొని శారీరక ఉల్లాసాన్ని మానసిక ఉల్లాసాన్ని ఏర్పరచుకోవాలి అన్నారు. స్పోర్ట్స్ కోటాలో కూడా ప్రభుత్వ ఉద్యోగం పొందవచ్చని అందు కోసం క్రీడల్ని ప్రత్యేక రంగాలుగా ఎంచుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, మార్షల్ ఆర్ట్స్ మాస్టర్లు విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను వంచిస్తున్న పాలకులు

**-బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రొయ్యూరు శేషసాయి**

**చిక్కడపల్లి డిసెంబర్ 7,ప్రభాతవార్త :**
ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నదని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రొయ్యూరు శేషసాయి ఆరోపించారు. ఆదివారం అడిక్ మెట్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారం టీలను అమలు చేస్తామని చెప్పిన పాలకులు వాటిని ఎంత మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. జీతాలు ఇవ్వడానికి ప్రభుత్వ ఆస్తులు సైతం అమ్ముతూ అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని చెప్పారు. మహిళలకు చేయూత, యువ వికాసం, నిరుద్యోగ భృతి వంటి హామీలు అటకె క్కగా, ఏకపక్షంగా 27 మున్సిపిటీలను జిహెచ్ఎంసిలో విలీనం చేశారని విమర్శించారు. తాజాగా హిల్ట్ పాలసీ పేరిట పారిశ్రామిక భూములను స్వాహా చేయడానికి ప్రయ త్నించడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ ఆదివారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వ హిస్తున్న ధర్నాకు మద్దతుగా తరలి రావాలని శేషసాయి విజ్ఞప్తి చేశారు.

## అంజయ్యకు " సిమా-2025" అవార్డు



అంజయ్యకు అవార్డు అందిస్తున్న రాజేంద్రప్రసాద్, అలీ తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 7,ప్రభాతవార్త:**
తెలంగాణ విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పి.అంజయ్యగా పనిచేస్తున్న సోషల్ ఫిలాంత్రోపిస్ట్ సిమా -2025 అవార్డును అందుకున్నారు సౌత్ ఇండియా మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో బెంగళూరు మాల్ ఆఫ్ ఆసియాలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు సినీ నటులు రాజేంద్రప్రసాద్, అలీ, కర్ణాటక రాష్ట్ర ప్రముఖుల చేతులమీదుగా అంజయ్య అవార్డు అందుకున్నారు. ఈకార్యక్రమానికి దక్షిణాది రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు.

## దాసారం బస్తీలో అయ్యప ప‌డిపూజ‌లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



అయ్యప్ప స్వామికి హారతి ఇస్తున్న తలసాని

**సంజీవరెడ్డి నగర్,డిసెంబర్ 7 ప్రభాతవార్త:** సనత్ నగర్‌లోని దాస రం బస్తీల్లో శ్రీనివాస్,క్రిష్ణ నవీన్‌ల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వ హించిన అయ్యప్ప స్వామి పడిపూజలకు మాజీ మంత్రి, సనత్ నగ ర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరైయ్యారు. అయ్యప్ప స్వామికి పూజ నిర్వహించిన అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సన్మానించి తీర్థప్రసాదాలు అందజే శారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, సనత్ నగర్, అమీర్‌పేట్ డివిజన్ల అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, ముత్యాల హన్మంతరావ్, సీనియర్‌నాయకులు అశోక్ యాదవ్, కరుణాకర్‌రెడ్డి,ప్రవీణ్ రెడ్డి, పుట్టాల శేఖర్, బాల్‌రాజ్, కూతురు నర్సింహ్మా, బలరామ్, గుడిగె శ్రీనివాస్ యాదవ్,ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

### నూతన పూజా గదిని ప్రారంభించిన కార్పొరేటర్



శ్రీ ఉప్పలమ్మ దేవీ ఆలయంలో నూతన పూజా గదిని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ చీరె దంపతులు.

**బేగంపేట డిశంబరు 7,ప్రభాతవార్త**

రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలోని ఓల్డ్‌గ్యాస్‌మండీ శ్రీశ్రీశ్రీ ఉప్పల మ్మ దేవీ ఆలయం లో నూతన పూజా గదిని రాంగోపాల్‌పేట కార్పొరేటర్ చీరె సుచిత్ర శ్రీకాంత్ దంపతులు ఆదివారం ప్రారంభిం చారు.కీ.శే చీర పొండు ఆయన ధర్మపత్ని వరమ్మల జ్ఞాపకార్థం ఈ పూజా గదిని చీరె సుచిత్ర,సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్మించగా కార్పొరేటర్ దంపతులు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ చేసారు.

### సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి : ఎమ్మెల్యే శ్రీగణేష్



5 వ వార్డు కాకగూడలో ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న బస్తీ వాసులు

**కంటోన్మెంట్,డిసెంబర్ 7 ప్రభాతవార్త:** కంటోన్మెంట్‌లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. ఆదివారం 5వ వార్డులోని కాకగూడలోని కింద బస్తీ, బాలాజీ కాలనీ, గడ్డ మీది బస్తీ,ధర్జీ బస్తీలలో విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంచినీటి ఎద్దడి తీవ్రంగా ఉందని ప్రత్యామ్నాయంగా బోర్‌వెల్స్‌ను ఏర్పాటు చేయాలని, క మ్యూనిటీ హాల్‌ను ఏర్పాటు చేయాలని, రోడ్లు,డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను త్వరిత గతిన పరిష్కరిస్తానని ఎమ్మెల్యే శ్రీగణే ష్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంకి రవిందర్,తేలుకుంట సతీష్, నాగేందర్ యాదవ్,సంతోష్, బిక్షపతి, బాలక్రిష్ణ, అశోక్, అరవిందర్ తదితరులు పాల్గొన్నారు.

### హిందూ స్మశాన వాటికల అభివృద్ధికి కృషి



బోయిన్‌పల్లిలో హిందూ స్మశాన వాటికను పరిశీలిస్తున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ వి.పీలు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, సదాకేశవరెడ్డి

**కంటోన్మెంట్,డిసెంబర్ 7 ప్రభాతవార్త:** బోయిన్‌పల్లి, చిన్న తోకట్ట లోని అంజయ్య మెమోరియల్ హిందూ స్మశాన వాటికలో మౌళిక సదుపాయాలు మెరుగుపర్చేందుకు తగు చర్యలు తీసుకుంటామని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదాకేశవరెడ్డి, జక్కుల మహేశ్వర్‌రెడ్డిలు తెలిపారు.గ్రేవ్ యార్డు అభివృద్ధికమిటీ విజ్ఞప్తి మేరకు ఆదివారం వారు పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. స్మశాన వాటికలో తమ సొంత నిధులతో షెడ్డు, టాయిలెట్స్, బాత్ రూమ్స్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కొండల్ యాదవ్,బాస్కరన్, విజయ్ బాబు, శ్రీవైలం, శ్రీధర్, కవిత తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులు అంతర్జాతీయ పోటీల్లో రాణించాలి

### : ఎమ్మెల్యే తలసాని



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**అడ్డగుట్ట,డిసెంబర్ 7 ప్రభాతవార్త:** క్రీడాకారులు జాతీయ, అంతర్జా తీయ పోటీల్లో రాణించే విధంగా పోటీ పడాలని, మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. అమీర్‌పేట్ డివిజన్ బల్కంపేట హన్‌మాన్ వ్యాయామ శాలకు చెందిన యువకులు,విద్యార్థులు ఇటీవల జరిగిన రెజ్లింగ్ క్రీడా పోటీ ల్లో గోల్డ్, సిల్వర్ మెడల్స్‌సాధించిన బస్తీ, శ్రావన్‌లను ఆదివారం మారేడ్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వేషుకుమారి, బిఆర్ఎస్ నాయకులు హన్మంత్ రావ్, అశోక్ యాద వ్, నర్సింహ్మా, బలరామ్, వనం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్గత శక్తిని విలువైనదిగా భావించాలి

**-దీదీ కృష్ణకుమారి ప్రేరణాత్మక ప్రసంగం**

**హైదరాబాద్,డిసెంబరు 7,ప్రభాతవార్త:**

మీ విధిని మీరే రూపొందించుకోడానికి సరైన నిర్ణయా లు తీసుకోవాలని ప్రపంచ మానవతావాది, ఆధ్యాత్మిక నాయకురాలు సాధు వాస్వానీ మిషన్ గ్లోబల్ అధిపతి దీదీ కృష్ణకుమారి పేర్కొన్నారు. దీదీ కృష్ణకుమారి హైద రాబాద్‌ను సందర్శించిన నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల సాధు వాస్వానీ మిషన్, హైదరాబాద్‌లోని సాధు వా స్వానీ ఇంటర్నేషన్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆది వారం సికింద్రాబాద్ సిక్ విలేజ్‌లోని ఇంపీరియల్ గార్డెన్స్‌లో "మీ విధిని రూపొందించండి మీ మార్గాన్ని ఎవరు రూపొందిస్తారు? మీరు చేస్తారు "(డిజైన్ యువర్ డెస్టినీ హు షేప్స్ యువర్ పాథ్") అనే అంశంపై ప్ర సంగించారు. ఆద్యంతం ఆలోచనలకు దారితీసే విధంగా ప్రేరణాత్మక ఉపన్యాసం అందించారు. మన గమ్యం ముందే రాయబడింది కాదు.. మనమే ప్రతి రోజూ తీసుకునే నిర్ణయాలతో దాన్ని నిర్మించుకుంటాం అని దీదీ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ప్రతి చిన్న నిర్ణ యం కూడా మన భవిష్యత్తు తీరు నిర్ణయిస్తుందని దీదీ కృష్ణకుమారి స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో ఒక లైక్ రాకపోయినందుకు కలిగే బాధ నుంచి, ఒక కార్యక్ర మానికి హాజరు కావాలా వద్దా అన్న నిర్ణయం వరకు జీవితం ఎప్పటికప్పుడు మన చేతుల్లోకి ఎన్నో ఎంపి కలను అప్పగిస్తూనే ఉంటుందన్నారు. మన పరిస్థితులు మనల్ని నడవవని మనమే స్టీరింగ్ పట్టుకుంటే జీవితా న్ని నడిపించగలుగుతాం అని దీదీ గుర్తుచేశారు. ఉత్తమ నిర్ణయాలు తీసుకోవడానికి దీదీ కృష్ణకుమారి రెండు అల వాట్లను సూచించారు. మొదటిది..మన ఆలోచనలను క్రమంగా సంరక్షించుకోవడం. నేటి జీవన శైలిలో ఇత రులతో పోల్చుకోవడం, మన వద్ద లేనిదాన్ని కావాల నుకోవడం సహజమైపోయిందన్నారు. అయితే మనపై వచ్చే ఆరోపణలపై దృష్టి పెట్టకుండా, మనకు ఉన్న స న్నిహితుల ఆశీర్వాదాలపై కృతజ్ఞత వ్యక్తం చేసే భావ నను పెంపొందించుకోవాలని ఆమె సూచించారు. ప్రతి ఆలోచన భవిష్యత్తుకు విత్తనమవుతుందని అన్నారు. మనమే జోక్యం చేసుకునే క్షణం నుంచే గమ్యం మారు తుంది అని దీదీ కృష్ణకుమారి పేర్కొన్నారు. రెండో అల వాటు..సమయాన్ని, అంతర్గత శక్తిని విలువైనదిగా భా వించడం. ప్రతి రోజు మన జీవితం ఒక చిన్న నౌక లాంటిది.

దానిలో ఏది పడితే అది పోస్తే అది మునిగి పోతుంది అని ఉదాహరణతో వివరించారు. ఈ కార్యక్ర మంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సాధు వాస్వానీ మిషన్ ట్రస్టీలు డాక్టర్ హరీష్ మిర్చందాని, హీరా రూపానీ , హరి సాధ్వని, తరుణ్ దహిర్వేద్వాని పాల్గొన్నారు.

## వైన్స్ ఇతర ప్రాంతాలకు తరలించాలి :షేక్‌పేట్ వాసులు



ఎక్సైజ్ శాఖ సూపరిండెంటెంట్ పంచాక్షరికి కాలనీ వాసులు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

**అఫ్జల్‌గంజ్,డిసెంబర్ 7 ప్రభాతవార్త:** నిబంధనలకు విరుద్ధంగా,ద్వారకానగర్ కాలనీ,షేక్‌పేట్,జూబ్లీహిల్స్ డి విజన్‌లలో నూతనంగా ఏర్పాటు చేయనున్న వైన్స్‌ను ఇతర ప్రాంతాలకు తరలించాలని,కోరుతూ నాంపల్లిలోని అబ్కారీ భవన్‌లో ఎక్సైజ్‌శాఖ సూపరిండెంటెంట్ పంచా క్షరిని కలిసి కాలనీవాసులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.అనంతరం ద్వారకనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసి యేషన్ అధ్యక్షులు ఎన్.రమేష్‌యాదవ్,జనరల్ సెక్రటరీ ఆర్.గోవింద్,ఉపాధ్యక్షులు బుచ్చిరెడ్డిలు మాట్లాడుతూ ఇటివల వైన్స్ టెండర్లో,వైన్‌షాపును దక్కించుకున్న ఓ వ్యాపారి,నిబంధనల ప్రకారం గుడి,బడికి 100మీటర్ల దూరంలో వైన్స్‌ను ఏర్పాటు చేయాల్సిన నిబంధనలు ఉన్నప్పటికి,వాటినితుంగలోకి తొక్కి 74మీటర్ల దూరం లోనే వైన్స్ ఏర్పాటు చేసేందుకు వ్యాపారి చర్యలు తీసు కుంటున్నారని,న్యాయస్థానాన్ని ఆశ్రయించి,ఫీల్,దాఖలు చేయడంతో న్యాయస్థానం కూడా తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని 100మీటర్ల తర్వాతేనే వైన్స్‌ఏర్పాటు చేయాలని చెప్పినప్పటికి సదరు వైన్స్ వ్యాపారి నిబం ధనలను ఏమాత్రం పట్టించుకోవడంలేదన్నారు.ఇక్కడ హన్‌మాన్‌దేవాలయం,కళాశాల,పాఠశాలలు ఉన్నప్ప టికి,ప్రతి రోజు భక్తులు,విద్యార్థులు వస్తుంటారని తెలిపా రు.మద్యం దుకాణం ద్వారా అనేక ఇబ్బందులు కలిగే అవకాశాలు ఉన్నట్లు చెప్పారు.వెంటనే జిల్లా కలెక్టర్, ఎక్సైజ్‌శాఖ అధికారులు స్పందించి వేరే చోటు మార్చా లని ప్రభుత్వాన్ని వారు డిమాండ్‌చేస్తున్నారు.ఈ కార్యక్ర మంలో కాలనిప్రతినిధులు ఎం.నరేష్‌యాదవ్,ఎస్.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

### ముదిరాజ్‌లు హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉద్యమించాలి : గజ్జెల నాగేశ్



బోయిన్‌పల్లి ముదిరాజ్ సంఘం సమావేశంలో ప్రసంగిస్తున్న గజ్జెల నాగేశ్ తదితరులు

**కంటోన్మెంట్,డిసెంబర్ 7 ప్రభాతవార్త:** అన్నిరంగాల్లో వెనుక బడి ఉన్న ముదిరాజ్‌లు తమ హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉద్యమించాలని తెలంగాణ ఉద్య మ నేత గజ్జెల నాగేశ్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపా ధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, కొర్వి క్రిష్ణ స్వామి, ముదిరాజ్ సేవా సమితి అధ్యక్షులు పిట్ల నాగేశ్ తెలిపా రు. ఆదివారం న్యూ బోయిన్‌పల్లి ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గ పరిచయ వేదిక కార్యవర్గ సమావేశా నికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వేణుగోపాల్, అశోక్, శ్రీనివాస్, భాస్కర్, రవిందర్, గోవింద్,సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరా పార్కుకు తరలివెళ్లిన మోండా డివిజన్ బిజెపి నేతలు



మోండా డివిజన్ నుంచి ఇందిరా పార్కుకు తరలివెళ్తున్న మోండా కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు

**అడ్డగుట్ట,డిసెంబర్ 7 ప్రభాతవార్త:** కాంగ్రెస్ మోసపూ రిత పాలనకు వ్యతిరేకంగా ఆదివారం ఇందిరా పార్కు వద్ద తలపెట్టిన మహా ధర్నాకు ఆదివారం మోండా డివి జన్ కార్పొరేటర్ కొంతం దీపిక ఆధ్వర్యంలో బిజెపి నాయకులు చిన్న వీరయ్య,సత్య నారాయణ, నర్సింగ్‌రా వ్,హరి,గణేష్, భరత్, శేఖర్‌లతో పాటు వందలాది మంది బిజెపి నాయకులు ఇందిరా పార్కుకు తరలివెళ్ళారు.

### ఖాళీ స్థలంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా సౌకర్యాలు కల్పించాలి

**కంటోన్మెంట్,డిసెంబర్ 7 ప్రభాతవార్త:** జూబ్లీ బస్టేషన్ పక్కన ఉన్న కంటోన్మెంట్ బోర్డుకు చెందిన స్థలంలో గత కొన్ని సంవత్సరాల నుంచి నిబంధనలకు విరుద్ధం గా హోటల్స్,టీ స్టాల్స్,పాన్ డబ్బాలు వంటి హోట ల్స్‌ను ఏర్పాటు చేసుకొని వ్యాపార కార్యకలాపాలు కొనసాగించారు. గత మూడు నెలల క్రితం ఈ స్థలంలో ఏర్పాటు చేసుకున్న హోటల్స్‌ను కంటోన్మెంట్ బోర్డు అధికారులు తొలగించి స్వాధీనం చేసుకున్నారు. దాని పక్కనే కోట్లాధి రూపాయల వ్యయంతో 5 ఎకరాల విస్తీ ర్ణంతో పికెట్ హటల్ బిహారి వాజ్ పేయి పార్కును ని ర్మించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ పార్కు కు వచ్చే వారికి తమ వాహనాలను పార్కింగ్ చేసేందుకు అవ కాశం లేకుండా పోయింది.దాని పక్కనే ఉన్న నాలా పై ర్యాంపో ఏర్పాటు చేసి వాహనాలను పార్కింగ్ చేయుట కు వేసులు బాటు కల్పించాలని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

### గల్బవీధిలో వైభవంగా అయ్యప్ప స్వామి మహాపడి పూజ



శ్రీ అయ్యప్ప స్వామి మహా పడి పూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

**మైలార్‌దేవ్‌పల్లి,డిసెంబరు 7 ప్రభాతవార్త :** పాతబస్తీ గల్బవీధిలో ఆదివారం అత్యంత వైభవంగా శ్రీ అయ్యప్ప స్వామి మహా పడి పూజ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు ఎం.సందీప్ గౌడ్, ఎం.గణేష్ గౌడ్,ఎం.జయంత్ గౌడ్‌తో పాటు అయ్యప్ప స్వాములు,భక్తులు పాల్గొన్నారు.

### వాగ్దానాలను మర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం



బిజెపి నిర్వహించిన మహాధర్నాకు కార్యకర్తలు,నాయకులతో కలిసి వెళ్లిన కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్

**బేగంబజార్,డిసెంబర్ 7 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ఘోరంగా విఫలం చెందినట్లు జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ అన్నారు. తెలంగాణ బిజెపి ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నా కార్యక్రమానికి గోషామహల్ నియోజకవర్గంలోని ఆయా డివిజన్‌ల నుంచి పెద్ద ఎత్తున్న ఇందిరాపార్క్‌కు చేరుకు న్నారు.జాంబాగ్‌డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు రఘు, కట్టప్ప రామకృష్ణ,తరలివెళ్లారు.గన్‌ఫౌండ్రి డివిజన్ నుంచి కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓంప్రకాష్‌బిస్వా ఆధ్వర్యంలో బిజెపి నాయకులు,కార్యకర్తలు తరలివెళ్లారు. ఈకార్యక్ర మంలో తదితరులు పాల్గొన్నారు.

### కృష్ణానగర్ కాలనీలో సిసి రోడ్డు ప్రారంభం



సిసి రోడ్డును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, డిసెంబరు 7 ప్రభాతవార్త:** లింగోజిగూడ డివిజన్ కృష్ణానగర్ కాలనీలో రూ.34.10లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డును కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో అభివృద్ధి పనులు కొనసా గుతున్నాయని అన్నారు. సరూర్‌నగర్ చెరువు బండ్ అభివృద్ధి పనులు, ట్రంక్‌లైన్ పనులు, చెరువు సుందరీ కరణ, కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరలోనే ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా అయ్యప్ప స్వామి మహాపడి పూజ



**చార్మినార్,డిసెంబరు 7 ప్రభాతవార్త :** పాతబస్తీ సుల్తాన్‌షాహిలోని శ్రీ జగదాంబ దేవాలయం కమిటి ఆధ్వర్యంలో స్వామి వార్ల మహా పడి పూజను అత్యంత భక్తి శ్రద్దలతో వైభవంగా నిర్వహిం చారు.దేవాలయం కమిటి చైర్మన్ రాకేష తివారీ పర్యవేక్ష ణలో స్వాములు శ్రీ అయ్యప్ప స్వామి పడిని సర్వాంగ సుందరంగా అలంకరించారు.వేద పండితుల మంత్రోచ్ఛా రణ మధ్య స్వామికి అభిషేక పూజను నిర్వహించా రు.శ్రీ అయ్యప్ప స్వామి భజనలు,భక్తి గీతాలు స్వాము లను,భక్తులను ఆధ్యాత్మిక సాగరంలో ఓలాలడించాయి. ఈ కార్యక్రమంలో శ్రీ జగదాంబ దేవాలయం కమిటి చైర్మన్ రాకేష్ తివారీ,అయ్యప్ప స్వాములు,భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రశాతంగా ఏపి మహేష్ కోఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికలు

**-36.16శాతం పోలింగ్ నమోదు**
**-జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ మనుచౌదరి**



పోలింగ్ తీరుపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి, వెంకటాచారి తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 7,ప్రభాతవార్త:** ఏపీ మహేష్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ల ఎన్నికలు ఎలాంటి సంఘటనలు జరగకుండా సజావుగా, ప్రశాంత వా తావరణంలో నిర్వహించటం జరిగిందని ఇంచార్జి కలెక్టర్ మ ను చౌదరి తెలిపారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లోని కమలా నెహ్రూ పాలిటెక్నిక్, సరోజినీ నాయుడు వనిత మహా విద్యాలయలలోజరిగిన ఎన్నికల పోలింగ్ కేంద్రాలను రెవెన్యూ అధికారి ఈ .వెంకటాచారితో కలిసి కలెక్టర్ పరిశీలిం చారు. ఈ సందర్భంగాపోలింగ్ బూతులలో విధులు నిర్వహి స్తున్న అధికారులతో పోలింగ్ జరుగుతున్న ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా, ఎలాంటి తప్పులు దొర్లకుండ జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు, హైదరాబాద్, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ లతో పాటు ఇతర రాష్ట్రాల్లోని మొత్తం 78 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించగా దాదాపు 36.16 శాతం పోలింగ్ న మోదు అయినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే మొత్తం 78 కేంద్రాలలో 37142 మంది ఓటర్లకు గాను మహిళా ఓటర్లు 5087 , పురుష ఓటర్లు 8342 మొత్తం 13429 ఓట్లు నమో దు అయినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో హైద్రా బాద్ ఆర్డీవో రామకృష్ణ , లా ఆఫీసర్ శ్రీధర్, డిసిఓ ప్రసన్న, స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ జ్యోతి, నాంపల్లి తాసిల్దార్ నయీముద్దీన్, రెవెన్యూ ,పోలీస్ , వివిధ శాఖల జిల్లా అధికా రులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### విద్యతో పాటు నచ్చిన రంగంలో ప్రతిభను చూపాలి : ఇన్స్‌పెక్టర్ సైదులు



భరతనాట్యంలో ప్రతిభ చూపిన కళాకారులకు అవార్డు అందిస్తున్న ఇన్స్ పెక్టర్ సైదులు,గౌరపల్లి రమేష్.

**బేగంపేట డిశంబరు 7,ప్రభాతవార్త**

విధ్యార్థులు విద్యతో పాటు వారికి నచ్చిన రంగంలో ప్రతిభను చూపాలని బేగంపేట ఇన్స్ పెక్టర్ సైదులు అన్నారు.ఆదివారం బేగంపేట మయూరిమార్గ్ ద్వారక్‌దాస్ కాలనీ పార్కులో నృత్య కళాకారిణి స్వప్న సంతోషి నేతృత్వంలో భరత నాట్యంలో శిక్షణ పూర్తి చేసుకుని ప్రదర్శించిన కళాకారులకు ముఖ్య అతిధు లు బేగంపేట ఇన్స్ పెక్టర్ సైదులు,నగర కాంగ్రెస్ పార్టీ సీని యర్ నాయకులు గౌరపల్లి రమేష్‌ల చేతుల మీదుగా బహుమ తి,ప్రశంసాపత్రాలను అందజేసారు.ఈ సందర్భంగా ఇన్స్ పెక్టర్ మాట్లాడుతూ గురువులు నేర్పిన అంశాలను నిశితంగా పరిశీలి స్తూ నేర్చుకుని ప్రావీణ్యం పొందడాన్ని అభినందిస్తున్నాన న్నారు.ఇక్కడ శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ భవిష్యత్‌లో పెద్ద ప్రదర్శనలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.నగర కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు గౌరపల్లి రమేష్ మాట్లాడు తూ నృత్య కళాకారిణి స్వప్న సంతోషి నేతృత్వంలో భరత నాట్యంలో శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ తమ కంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకునేలా ముందుకు వెళ్లాలని తా ను కోరుకుంటున్నానన్నారు.ఎంతో మంది చిన్నారులకు భరత నాట్యం నేర్పి వారిలోని నాట్య కళను వెలికి తీసిన స్వప్న సంతోషిని కూడా ప్రత్యేకంగా రమేష్ అభినందించారు. అనంత రం శిక్షణ పూర్తి చేసుకున్న చిన్నారులకు బహుమతులు, ప్రశం సా పత్రాలను అందజేసారు.ఈ కార్యక్రమంలో ద్వారక్‌దాస్ కాలనీ కి చెందిన ప్రవీణ్ ఒకరియా,సతీష్ అగర్వాల్, కౌశల్, జయేష్,అంకిత్,చిన్నారుల తల్లి దండ్రులు కాంగ్రెస్ నాయకుడు దర్గ కరుణాకర్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా బిల్లులో బిసి మహిళలకు సబ్-కోటా కల్పించాలి

**-ఉద్యోగాలలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్‌లు ఇవ్వాలి**
**-సంపూర్ణ మద్యాపాన నిషేదం అమలు చేయాలి**
**-ప్రభుత్వాలు మహిళల ఖాతాల్లో రైతు బంధు డబ్బులు జమ చేయాలి**
**-రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి**



గంగాపురం పద్మకు నియామక పత్రాన్ని అందిస్తున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో ర్యాగా అరుణ్‌కుమార్, మహిళా నేతలు

**సైఫాబాద్, డిసెంబరు 7 ప్రభాతవార్త:** పార్లమెంట్‌లో పాసైన మహిళా బిల్లులో బిసి మహిళలకు సబ్-కోటా కల్పించినప్పుడే రాజ్యాధికారం లభిస్తుందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. మహిళల పక్షపాతి అయిన నరేంద్రమోదీ అన్ని రంగాలలో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలని ఆలోచిస్తున్న నేపథ్యంలో బిసి మహిళలకు కూడా ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఆది వారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన జాతీయ బిసి మహిళా సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. మహిళా బిల్లులో బిసి మహి ళలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే ఆ బిల్లుకు సార్థకత లేదని, మహిళా బిల్లు గురించి రెండు దశాబ్దాలకుపైగా గొంతులు చించుకుని మాట్లాడిన రాజకీయ పార్టీల నాయకులు బిసి మహి ళల గురించి, వారికి జరుగుతున్న అన్యాయాలు, అత్యాచారాల గురించి ఎందుకు మాట్లాడరని ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. బిసి మహిళలంటే చిన్నచూపా ?, సబ్-కోటా గురించి అసెంబ్లీ లో మొక్కుబడిగా తీర్మానం చేసి చేతులు దులుపుకుంటే సరిపో తుందా? దేశ జనాభాలో సగం ఉన్న బిసి మహిళలకు కోటా ఇవ్వకుండా మహిళల గురించి మాట్లాడటం అన్యాయమన్నారు. మహిళా బిల్లులో రాజకీయ రిజర్వేషన్‌లతోపాటు విద్యా, ఉద్యోగాలలో 50 శాతం రిజర్వేషన్‌లను ప్రవేశపెట్టాలని, రాజకీయ రిజర్వేషన్‌లు పెడితే 180 మంది మహిళలు పార్లమెం ట్‌లో సభ్యులవుతారని, ఉద్యోగాల్లో రిజర్వేషన్‌లు పెడితే కేంద్ర ప్రభుత్వంలోని 54 లక్షల ఉద్యోగాల్లో 27 లక్షల ఉద్యోగాలు, 29 రాష్ట్రాలలో కలిపితే ఒక కోటి 80 లక్షల ఉద్యోగాలలో 90 లక్షల ఉద్యోగాలు మహిళలకు దక్కుతాయని ఆయన వివరిం చారు. మహిళల రక్షణ కోసం ఆనేక చట్టాలు ఉన్నప్పటికి వారి పై దాడులు, అత్యాచారాలు తగ్గలేదని, పురుశాధిక్యత తగ్గలేద ని, మహిళల రక్షణ కోసం మరిన్ని చట్టాలను తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. సంపూర్ణ మద్యాపాన నిషేదం విధించి నప్పుడే మహిళల ప్రగతి పెరుగుతుందని, బీహార్‌లో మద్యపా నం నిషేదించిన తరువాత అత్యాచారాలు, హత్యలు తగ్గిపో యాయని, మద్యపాన నిషేదం కోసం మహిళలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమించాలని ఆర్. కృష్ణయ్య పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు రైతు బంధు డబ్బులు మహిళల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ బిసి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలుగా గంగా పురం పద్మను ఆర్.కృష్ణయ్య నియమించారు. ఈ సమావేశం లో సంఘం జాతీయ కో-ఆర్డినేటర్ డాక్టర్ ర్యాగా అరుణ్‌కు మార్, జాతీయ నాయకుడు గవ్వల భరత్‌కుమార్, మహిళా నేతలు అనురాధమ్మ, దివ్యయాదవ్, దీప, సి.హెచ్.పద్మ, వసంతమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

### నిత్య సాహితీ కృషీవలుడు దాస్యం సేనాధిపతి

**: మహారాష్ట్ర పూర్వ గవర్నర్ సిహెచ్.విద్యాసాగర్‌రావు**



అక్షరగీతం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న విద్యాసాగరరావు,అశోక్‌తేజ తదితర అతిథులు

**నాంపల్లి, డిసెంబరు 7 ప్రభాతవార్త :** నిత్య నిరంతర సాహితీ కృషివలుడు దా స్యం సేనాధిపతి అని మహారాష్ట్ర పూర్వ గవర్నరు సిహెచ్.విద్యాసాగరరావు అన్నారు. ఉదయ సాహితి-తెలంగాణ ఆధ్వర్యంలో నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం లోని డా. నందమూరి తారక రామారా వు కళావేదికలో ప్రముఖకవి, జాతీయ ఉత్తమ సినీగేయ పురస్కార గ్రహీత డా. సుద్దాల అశోక్‌తేజ సభాధ్యక్షతన జరిగిన పుస్త కావిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిహెచ్.విద్యాసాగరరావు విశిష్ట అతిథులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీమంత్రి అమర్‌సింగ్ తిలావత్, ఆశ్వాపురం వేణుమా ధవ్, ప్రముఖ కవయిత్రి ధూళిపాల అరుణ, దాస్యం లక్ష్మయ్య తదితరులతో కలిసి ప్రముఖ కవి, రచయిత, విమర్శకుడు దాస్యం సేనాధిపతి 70వ జన్మదినోత్సవం సంద ర్భంగా వెలువరించిన అక్షరగీతం సప్తది సంచికను ఆవిష్కరించి మాట్లాడారు. 300మం దికిపైగా కవులు, రచయితలు, బంధుమిత్రులు సేనాధిపతి వ్యక్తిత్వాన్ని, జీవితాన్ని, సాహిత్యాన్ని విభిన్న కోణాల్లో ఆవిష్కరించారని కొనియాడారు. సుద్దాల అశోక్‌తేజ అధ్య క్షోపన్యాసంలో సేనాధిపతి వివిధ ప్రక్రియల్లో రచించిన గ్రంథాలు సామాజిక చైతన్యానికి దోహదపడేలా ఉన్నాయని అభినందించారు. అమర్‌సింగ్ సభను ప్రారంభించగా, వేణుమాధవ్ తొలిప్రతిని స్వీకరించారు. అరుణ గ్రంథ పరిచయం కావించారు.

### వీధి కుక్కల నియంత్రణ పేరుతో జిహెచ్ఎంసిలో అవినీతి

**-హైదరాబాద్ సిటిజన్ ఫోరం, అర్బన్ డెవలప్ మెంట్ ఫోరం**

**చిక్కడపల్లి డిసెంబర్ 7,ప్రభాతవార్త :** జిహెచ్ఎంసిలో వీధి కుక్కల నియంత్రణ పేరుతో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని, వెటర్నరీ విభాగం పై జంతు ప్రేమికుల సం ఘాల ఆధిపత్యాన్ని నివారించాలని హైదరాబాద్ సిటిజన్ ఫోరం (హెచ్‌సిఎఫ్), అర్బన్ డెవలప్ మెంట్ ఫోరం (యుడిఎఫ్) డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక హెచ్‌సిఎఫ్ ఆఫీసులో జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో అర్బన్ డెవలప్‌మెంట్ ఫోరం (యుడిఎఫ్) కన్వీనర్ ఎం. శ్రీనివాస్, హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం (హెచ్‌సిఎఫ్) అధ్యక్షులు ఎం. శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి వీరయ్య పాల్గొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వీధి కుక్కల దాడిలో ఈ వారంలోనే ఇద్దరు బాలురు తీవ్రంగా గాయాల పాలయ్యారు, ప్రతినిత్యం ఇలాంటి ఘటనలు నగరంలో అనేకం జరుగుతున్నాయి. సుప్రీంకోర్టు తీవ్రం గా స్పందించిన తర్వాత కూడా గ్రేటర్ పరిధిలో వీధి కుక్కల నివారణపై తగిన చర్యలు లేవు. వెటర్నరీ విభాగం తమ బాధ్యతను వదిలించుకుని వీధి కుక్కల నిర్వహణ మొత్తం జంతు ప్రేమికుల సంఘాలకు, కాంట్రాక్టు ఏజెన్సీలకు అప్పజెప్పింది.అధికారులు, కాం ట్రాక్టు ఏజెన్సీలు కుమ్మక్కై కాకి లెక్కలు చెబుతూ నిధులన్నీ కాజేస్తున్నారు. జిహెచ్ఎంసి వెటర్నరీ విభాగం పై జంతు ప్రేమికుల సంఘాల ఆధిపత్యం నడుస్తున్నది. ఈ సంఘా లు చెప్పినట్టుగానే అధికార యంత్రాంగం పనిచేస్తున్నదని అన్నారు. గత ఐదేళ్లలో జిహెచ్ఎంసి లో వీధి కుక్కల నియంత్రణపై వెచ్చించిన నిధులు ఎన్ని? వీధి కుక్కల సం ఖ్య ఎంత తగ్గింది? ఏ సంస్థలు కాంట్రాక్టులు తీసుకున్నాయి? పబ్లిక్ ప్రదేశాలలో వీధి కుక్కల తొలగింపు పై సుప్రీంకోర్టు ఆదేశాలను ఏ మేరకు అమలు చేశారు ? పూర్తి వివ రాలతో సవివరమైన నివేదికను నగర ప్రజల ముందు ఉంచాలని హైదరాబాద్ సిటిజన్ ఫోరం, అర్బన్ డెవలప్ మెంట్ ఫోరం డిమాండ్ చేసారు.

### దశల వారీగా ప్రజాసమస్యల పరిష్కారం: కాంగ్రెస్

**సరూర్‌నగర్, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ లోని అల్మాస్‌గూడ, గుర్రంగూడలకు సంబంధించిన కాలనీల సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని ఎఐసి సి విచార్ విభాగ్ తెలంగాణ కో ఆర్డినే టర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన గుర్రం గూడలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహేశ్వరం కాంగ్రెస్ ఇంఛార్జి కెఎల్ఆర్, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, సర్కిల్ ఇంఛార్జి డిసి సరస్వతిల దృష్టి కి తీసుకెళ్ళి సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమణారెడ్డి, శ్యామ్, శివగౌడ్, ప్రసాద్, ప్రవీణ్, పూర్ణచం దర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాసంఘాలు కొవ్వొత్తులతో నివాళి

**సరూర్‌నగర్, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** 42 శాతం బిసి రిజర్వేషన్ల కోసం ప్రాణత్యాగం చేసిన సాయి ఈశ్వరా చారి ఆత్మశాంతి కోసం జిహెచ్ఎంసి మీర్‌పేట్ సర్కిల్‌లో ప్రజా సంఘాల నాయకులు కొవ్వొత్తులతో ప్రదర్శన చేసి నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా సంఘాల నాయకులు మాట్లా డుతూ ఈశ్వరాచారి బలిదానంతో బిసి రిజర్వేషన్ల ఉద్యమం ఉవ్వెత్తున లేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమం లో బహుజన ఐక్య వేదిక నాయకు లు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు దాసరి బాబు, రాజలింగం, సుంకోజు యాదగిరిచారి, రఘు,, శేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకయ్య, మల్లికార్జున్, ఉయ్యాల నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

